ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, గంగుల

కేటీఆర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

గులాబీ శ్రేణుల్లో జోష్

జిల్లా కేంద్రంలోని ప్రతిమ హోటల్‌లో గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అధ్యక్షతన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాగా, సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు హాజరై, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

-కార్పొరేషన్, మార్చి 7

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

తెలంగాణచౌక్, మార్చి 7: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మేయర్ సునీల్ రావు పేర్కొన్నారు. నగరంలోని డాక్టర్స్ స్ట్రీట్స్‌లో గల బ్రహ్మకుమారి కేంద్రంలో గురువారం ఆయన శివ ధ్వజం ఎగుర వేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ కేంద్రాల ఇన్‌చార్జి విజయబహెన్‌జీ, బ్రహ్మకుమారీలు మనీషా బహెన్‌జీ, మీనాక్షి బహెన్‌జీ పాల్గొన్నారు.

అన్నదానం

కమాన్‌చౌరస్తా, మార్చి 7: కరీంనగర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక గాంధీరోడ్డులో గురువారం యువజన సంఘం ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం చేశారు. అలాగే, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక స్వధార్ హోంలో అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టు సభ్యులు కాచం రాజేశ్వర్, బొల్లం శ్రీనివాస్, సుభాష్, నార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా శ్రీ కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి S/o. వీరారెడ్డి, గ్రామము, మండలము తిమ్మాపూర్, జిల్లా కరీంనగర్ గారు తన పేరున వుండబడిన ఇల్లు మరియు ఇల్లు ఖాళీస్థలము విస్తీర్ణం: 0-06 గుంటలు, సర్వే నెంబర్ 337/H, గ్రామపంచాయతి పరిధిలోని ఇట్టి ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు SBI, తిమ్మాపూర్ బ్రాంచ్‌లో తనఖా పెట్టి లోన్ తీసుకోవడం జరిగినది. డాక్యుమెంట్ నంబర్స్ 5373/2010, 6533/2010, SRO కరీంనగర్ రూరల్ మరియు గ్రామపంచాయతికి సంబంధించిన ప్లాన్ మరియు అనుమతి పత్రములను తనఖా చేసి లోన్ తీసుకోవడం జరిగినది. ఇటి లోన్ తిరిగి చెల్లించడం జరిగినది ఇట్టి సమయంలో బ్యాంకులో తనఖా పెట్టిన అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్స్ మరియు లింక్ డాక్యుమెంట్స్ పోయినవి అని తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసినారు. పై డాక్యుమెంట్స్ ఎవరికైన దొరికినచో బ్యాంక్ మేనేజర్‌కు తెచ్చి ఇవ్వగలరు. కావున పోయినటువంటి దస్తావేజులపైన ఎవరికైన అభ్యంతరాలు వుంటే ఈ నోటీస్ ప్రచురించిన తేది నుండి 7 రోజులలోగా బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించగలరు. ఇట్టి ఆస్తి పైన బ్యాంక్ వారు తిరిగి కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి గారికి లోన్ మంజూరు చేయుదురు. ఇట్టి ఆస్తికి హద్దులు: తూర్పు: పైడిపల్లి అయిలయ్య & కొన్నవారి వ్యవసాయ భూమి, పడమర: త్రోవ, ఉత్తరం: కోంజర్ల శంకరయ్య గారి వ్యవసాయ భూమి, దక్షిణం: కేతిరెడ్డి శేఖర్‌రెడ్డి గారి వ్యవసాయ భూమి.

ఇట్లు: సం/- **నీరుమల్ల శంకర్,** LLB
SBI బ్యాంక్ తరుపున న్యాయవాది
కరీంనగర్. సెల్ నెం. 94416 45656

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఘనంగా మహిళా దినోత్సవం

అల్ఫోర్స్‌లో వేడుకల్లో కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, అధ్యాపకులు

కార్పొరేషన్/తెలంగాణచౌక్/కమాన్‌చౌరస్తా/గంగాధర/విద్యానగర్/వీణవంక/చిగురుమామిడి/మానకొండూర్‌రూరల్, మార్చి 7: జిల్లా వ్యాప్తంగా గురువారం ముందస్తుగా మహిళా దినోత్సవం నిర్వహించారు. కాగా, నగరంలోని ఎస్సారార్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో లావెండర్ బ్యూటీ జోన్ వ్యవస్థాపకురాలు ఉమారాణి, శివసాయి హోమ్ ఫుడ్స్ వ్యవస్థాపకురాలు సుజాత రెడ్డి, చింటూ ప్రింట్స్ వ్యవస్థాపకురాలు భద్రవతి, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ ఉమా మహేశ్వరి, కళాశాల ఈడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ సతీశ్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజయ్య పాల్గొన్నారు. అనంతరం ఎల్ఐసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సంస్థ డెవలప్‌మెంట్ అధికారి చక్రపాణి బహుమతులు ప్రదానం చేశారు. డాక్టర్ మల్లా రెడ్డి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ శారద, శిరీష తదితరులు పాల్గొన్నారు. స్థానిక అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అక్షయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ముకరంపురలోని వాగేశ్వరి ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ బీవీఆర్ గోపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ వెంకట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఏవో వేదవ్యాస్, లింగారావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. కరీంనగర్‌లోని బృందావన్ గార్డెన్‌లో కార్పొరేటర్ ఆకుల నర్మద-నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సఖీ కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, ఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, సీవో తిరుపతి, ఆర్పీలు మంజుల, లత, అరుణ, విజయ పాల్గొన్నారు. సప్తగిరికాలనీలోని రామాలయ ఆవరణలో శ్రీసప్తగిరి లయన్స్ ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్లబ్ అధ్యక్షురాలు పన్యాల సుజాత, సభ్యులు సత్యవతి, విమల, నిరంజనీ దేవి, సుజాత, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు విజయ, స్వప్న, టీచర్లు ఉషారాణి, హరి ప్రియ, పన్యాల వెంకటరెడ్డి, కోటేశ్ కుమార్, రామచందర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, నగరంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, నాయకులు అన్నపూర్ణ, జరీనా, లక్ష్మి, స్వప్న, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. వీణవంకలో టీసెర్ప్ ఐకేపీ జీవనజ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవానికి ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. డీఆర్‌డీపీ డీపీఎం రమణ, ఏపీఎం కొమురయ్య, సీసీలు ఆనంద్, ఘణశ్యామ్, తిరుపతి, శ్రీకాంత్, స్త్రీనిధి మేనేజర్ అనిల్, వీవో ప్రెసిడెంట్లు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు. గంగాధర మండలం గర్శకుర్తి సరస్వతీ విద్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీటీసీ తడిగొప్పుల రజిత, కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిగురుమామిడి రైతు వేదికలో నిర్వహించిన వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, ఎంపీడీవో మధుసూదన్, సూపరింటెండెంట్ ఖాజా మొహినొద్దీన్, ఎంపీవో శ్రవణ్‌కుమార్, కేడీసీసీ ఏజీఎం జమున, బ్యాంకు మేనేజర్ అనిత పాల్గొన్నారు. మానకొండూర్ మండలం ఊటూర్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం స్వరూపారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ఇంటి నుంచే శ్రీకారం చుట్టాలి

కలెక్టరేట్/ కరీంనగర్ రూరల్, మార్చి 7: మహిళలు చాలా శక్తిమంతులని, వారు ఏదనుకున్నా దానిని సాధించి తీరుతారని, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తుండడమే ఇందుకు నిదర్శనమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం మహిళా, శిశు సంక్షేమం, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి కోసం తమ ఇంటి నుంచే శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే అబ్బాయిలు, అమ్మాయిలను సమానంగా చూడాలన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ మాట్లాడుతూ, పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత మహిళలపై ఉందన్నారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేసి, పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. అంతకుముందు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ఎంపీపీలు కొత్త వినీత, రాణి, కవిత, జడ్పీటీసీలు పురమల్ల లలిత, సౌజన్య, బల్దియా డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, నగరంలోని ఓ హోటల్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కరీంనగర్ రీజినల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం ప్రభుదాసు, ఎస్ఎం ఓ సాయికృష్ణ, ఎస్ఎంబీ రాజు, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఎంపీ బండి సంజయ్‌కు జడ్పీటీసీ బహిరంగ లేఖ

కలెక్టరేట్, మార్చి 7: ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి తెచ్చిన నిధులెన్ని?, చేసిన అభివృద్ధి ఎంటో శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్, చిగురుమామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్ ఎంపీ బండి సంజయ్‌కి బహిరంగ లేఖ రాశారు. నగరంలోని జడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆయన లేఖ విడుదల చేశారు. ఐదేళ్లలో పార్లమెంట్ సెగ్మెంట్‌కు ఎన్ని నిధులు కేటాయించారో, ఎంతమేర అభివృద్ధి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని లేఖలో డిమాండ్ చేశారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ ఫిర్యాదు

హుజూరాబాద్, మార్చి 7: పట్టణంలో అనధికారికంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లను వెంటనే నిలిపివేయించి, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు పోలీస్ కమిషనర్‌ను మున్సిపల్ పాలక వర్గం కోరింది. ఈ మేరకు గురువారం జరిగిన మున్సిపల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కదనభేరి సభను విజయవంతం చేయాలి

చిగురుమామిడి: బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్, మార్చి7: ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించే కదనభేరి సభను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని, మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ

చిగురుమామిడి, మార్చి 7: కరీంనగర్ కదనభేరి సభకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఆర్బీఎస్ జిల్లా మాజీ సభ్యుడు కొమురయ్య, వైస్ ఎంపీపీ రాజి రెడ్డి, నాయకులు తిరుపతి, శివప్రసాద్, సర్వర్ పాషా, ఎస్కే సిరాజ్, సంపత్ రెడ్డి, లక్ష్మీ రెడ్డి, కిషన్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంలోనే కుప్పకూలి రైతు కూలీ హఠాన్మరణం

వీణవంక, మార్చి 7: పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు కూలీ పొలంలోనే కుప్పకూలాడు. దవాఖానకు తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషాద ఘటన వీణవంక మండలం బేతిగల్‌లో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేణుకుంట్ల పరశురాములు(48) గురువారం అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పురుగుల మందు పిచికారీ చేసేందుకు కూలీకి వెళ్లాడు. పురుగుల మందు కొడుతుండగా పొలంలోనే కుప్పకూలాడు. చుట్టుపక్కల రైతులు గమనించి జమ్మికుంట దవాఖానకు తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందాడు.

కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

రాంనగర్, మార్చ్ 7: నగరంలోని నాకా చౌరస్తా నుంచి హుస్సేనీపుర, ఖాన్‌పుర, గాంధీ రోడ్, అశోక్‌నగర్, కిసాన్‌నగర్ మీదుగా మంచిర్యాల చౌరస్తా వరకు సీఐఎస్ఎఫ్ బలగాలు గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలాగే, జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విలాసాగర్ గ్రామంలో కూడా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సీఐఎస్ఎఫ్ బలగాల సేవలు వినియోగించనున్నట్లు సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్, కంపెనీ కమాండెంట్ విక్రాంత్, అసిస్టెంట్ కమాండెంట్ విజేందర్, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, రవికుమార్, సురేశ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

రాంనగర్, మార్చి 7: ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌ను సీపీ అభిషేక్ మొహంతి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రీడోత్సవాలు

కొత్తపల్లి, మార్చి 7: నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో కిమ్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలు గురువారం ముగిసాయి. విజేతలకు విద్యా సంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపల్లి, మార్చి 7: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10న నిర్వహించే ఉమ్మడి జిల్లాస్థాయి మహిళా చదరంగ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కేసీ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనే వారు సెల్ నంబర్ 83312 06989, 91601 60161లో సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్ అనూప్‌కుమార్, వైద్యులు కృష్ణచైతన్య, చాందిని కొత్త, దివ్య గొల్ల, రాజశ్రీ జక్కు, కృష్ణ, సంతోష్, చెస్ అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

జమ్మికుంట మహిళకు అరుదైన గౌరవం

జమ్మికుంట, మార్చి7: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన మెప్మా ఆర్పీ, చేయూత ఫౌండేషన్ ఎన్జీవో కార్యదర్శి అబేదా భానుకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ హైటెక్ సిటీ నోవాటెల్‌లో గురువారం ఇండియా లీడింగ్ ఆన్‌లైన్ బిజినెస్ 'హైబిజ్ టీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బెస్ట్ ఉమెన్ లీడర్స్ షిప్ - 2024 అవార్డు అందుకున్నది. అబేదా భాను పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ, అన్నదానం, ఇతర సామాజిక కార్యక్రమాలు చేస్తున్నది. అవార్డు అందుకున్న భానుకు ఎన్జీవో వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన కేసులో తహసీల్దార్ అరెస్ట్

రాంనగర్, మార్చి 7: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తన బినామీ పేరు మీద భూమి రాయించుకున్న ఘటనలో గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్ సహా బినామీ చందా సంతోష్, అప్పటి వీఆర్ఏ పల్లె జీవన్‌ను కొత్తపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘు తన తాత ఐలయ్యకు ఆరెపల్లి, సీతారాంపూర్, రేకుర్తిలో భూములు ఉండగా, తన తండ్రి రాజు, చిన్నాన్నకు 2012లో సమాన భాగాలుగా పంచి రిజిస్ట్రేషన్లు చేయించాడు. సీతారాంపూర్, ఆరెపల్లిలోని భూములు మ్యుటేషన్ అయి ఆన్‌లైన్‌లో నమోదు కాగా, రేకుర్తిలోని సర్వే నంబర్ 29లో గల 30 గుంటల భూమి మాత్రం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయి ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఈ విషయమై అప్పటి కొత్తపల్లి ఎమ్మార్వో చిల్ల శ్రీనివాస్‌ను రఘు సంప్రదించగా అట్టి భూమిలో నుంచి 3.250 గుంటలు తన పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే సమస్యను పరిష్కరిస్తానని చెప్పగా ఒప్పుకోలేదు. ఈ క్రమంలో 2015లో బొంతల ఐలయ్య మృతిచెందగా సదరు ఎమ్మార్వో 2016లో రఘు నానమ్మ పేరు మీద ఐలయ్య రిజిస్ట్రేషన్ చేసినట్టు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడు. తహసీల్ ఆఫీసులో ధరణి ఆపరేటర్‌గా పని చేస్తున్న అప్పటి వీఆర్ఏ పల్లె జీవన్ (ప్రస్తుతం తూంకుంట మున్సిపల్ ఆఫీస్‌నందు జూనియర్ అసిస్టెంట్) సహాయంతో 2022 ఆగస్టులో బాధితుడి చిన్నాన్న, నలుగురి మేనత్తల పేరిట నాలుగున్నర గంటల చొప్పున, ఎమ్మార్వో బినామీ అయిన గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన చందా సంతోష్ తండ్రి శంకరయ్య పేరిట 3.250 గుంటలు మార్చినట్లు బాధితుడు రఘు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు చిల్ల శ్రీనివాస్, చందా సంతోష్, బొంతల రవి, బొంతల లావణ్య, ఉప్పుల కనక లక్ష్మి, దాడి రాధ, చుప్ప మంజుల, చిలువేరు స్వప్న, చిలువేరు మల్లేశం, పల్లె జీవన్, వినోద్, బుచ్చిరాజుపై కేసు నమోదు చేశారు. కాగా, ఎమ్మార్వో చిల్ల శ్రీనివాస్‌తో పాటు చందా సంతోష్, పల్లె జీవన్‌ను కోర్టులో హాజరుపరుచగా మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. కొత్తపల్లి పోలీసులు ముగ్గురు నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.

ఎనిమిది మంది ఎస్ఐల బదిలీ

రాంనగర్ మార్చి 7: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 8 మంది ఎస్ఐ లను బదిలీ చేస్తూ గురువారం సీపీ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ త్రీ టౌన్‌లో పని చేస్తున్న తిరుపతి వీణవంక, కరీంనగర్ టాస్క్ ఫోర్స్‌లో పని చేస్తున్న కిరణ్ రెడ్డి గంగాధరకు, వీణవంకలో పనిచేస్తున్న వంశీకృష్ణ సీసీఎస్‌బీకి, గంగాధరలో పనిచేస్తున్న అభిలాష్ కరీంనగర్ ట్రాఫిక్‌కు, రామగుండంలో పనిచేస్తున్న రమేశ్ కరీంనగర్ (వీఆర్), కరీంనగర్ త్రీ టౌన్‌లో పనిచేస్తున్న సురేందర్ రామడుగుకు, కరీంనగర్ రూరల్‌లో పనిచేస్తున్న రాజు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌కు, కరీంనగర్ టూ టౌన్‌లో పనిచేస్తున్న శేఖర్‌ను కరీంనగర్ రూరల్‌కు బదిలీ చేశారు.

అవార్డు అందుకున్న ఆర్ఎం

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్ఎం సుచరిత

తెలంగాణచౌక్, మార్చి 7: టీఎస్ ఆర్టీసీ గత అక్టోబర్ 15 నుంచి జనవరి 22వ తేదీ వరకు నిర్వహించిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ పోటీల్లో కరీంనగర్ రీజియన్ ప్రథమ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని బస్ భవనంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్ఎం సుచరితకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అవార్డుతో పాటు రూ. లక్ష నగదు పురస్కారం అందజేశారు. కరీంనగర్ రీజియన్ అధికారులను, సిబ్బందిని మంత్రి, ఆర్టీసీ ఎండీ అభినందించారు. రీజియన్‌లో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది సహకారంతోనే ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డీఎంలు మల్లయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

చొప్పదండి, మార్చి 7: మండలంలోని రుక్మాపూర్, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, గుమ్లాపూర్, రేవెల్లి, రాగంపేట, ఆర్నకొండ, చొప్పదండి గ్రామాల్లో గురువారం ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేపట్టారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.

'సంజీవని'లో ఉచిత వైద్య శిబిరం

జమ్మికుంట, మార్చి7: పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ దవాఖానలో మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 300 మంది మహిళలకు రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. మందులు అందించారు. ఇక్కడ వైద్యులు హేమలత, ప్రణీత, అనిత, సురేశ్, యూ సురేశ్ పాల్గొన్నారు.

కరీంనగర్ జడ్పీలో పోడియం ఎదుట బైఠాయించిన జడ్పీటీసీలు, ఎంపీపీలు

మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించాలి

- పంట పొలాలకు నీరందించాలి
- వాడివేడిగా జడ్పీ సర్వ సభ్యసమావేశం
- బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీల వాకౌట్

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 7: తెలంగాణకు జీవధార అయిన మేడిగడ్డ బరాజ్‌ను వెంటనే పునరుద్ధరించి, సాగుకు నీరందించాలని బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ జడ్పీ సమావేశమందిరంలో జరిగిన జడ్పీ సర్వ సభ్య సమావేశంలో గళమెత్తారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా రైతుల సమస్యలు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం చూపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి నెలకు ముందే కరీంనగర్ జిల్లాలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌పై ఉన్న కోపాన్ని రైతులకు రుద్దుతోందని, ఫలితంగా చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారంటూ ధ్వజమెత్తారు. మేడిగడ్డ బరాజ్ మరమ్మతులపై దృష్టి పెట్టకపోవడంతోనే సాగునీటికి తిప్పలు వచ్చాయని ఆరోపించగా, కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ జోక్యం చేసుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. దీంతో రెండు పార్టీలకు చెందిన జడ్పీటీసీల మధ్య వాగ్వావాదం జరిగింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పలువురు బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు పోడియం ఎదుట బైఠాయించారు. ప్రజా సంక్షేమం వీడి స్వలాభం కోసం పార్టీలు మారుతున్న నాయకులు తమను విమర్శించడం సరికాదని మండిపడ్డారు. రైతు సంక్షేమం కోసం ఆందోళన చేస్తుంటే గేలి చేయడం కాంగ్రెస్ నేతలకు రైతులపై ఉన్నత ప్రేమ ఎలాంటిదో అర్థమవుతున్నదన్నారు. రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ, సమావేశాన్ని వాకౌట్ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఈవో శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి: కలెక్టర్

విద్యానగర్, మార్చి 7: దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్‌లోని బుట్టి రాజారాం కాలనీలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. దవాఖానలో ఓపీ, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, ఎంసీహెచ్ పీవో సనా జవేరియా, మెడికల్ ఆఫీసర్ శోభ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరితో ఓటరుగా నమోదు చేయించాలి

కలెక్టరేట్, మార్చి 7: అర్హులందరితో ఓటరుగా నమోదు చేయించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట బల్దియా బడ్జెట్ @ రూ.23కోట్ల 24లక్షలు

జమ్మికుంట, మార్చి7: 2024-25 ఆర్థిక సంవత్సరానికి అంచనా బల్దియా బడ్జెట్ సమావేశం చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగింది. కమిషనర్ ఎండీ అయాజ్ బల్దియా బడ్జెట్‌ను పాలకవర్గం ముందు ప్రవేశపెట్టారు. ఆర్థిక సంవత్సరం బల్దియా బడ్జెట్ రూ.23కోట్ల 24లక్షల74వేలుగా రూపొందించారు. మేనేజర్ భూపాల్‌రెడ్డి, జేఏవో విమల, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శిగా అజయ్

గంగాధర, మార్చి 7: బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన బుర్ర అజయ్‌ని నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం మధురానగర్‌లో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, ఎంపీటీసీ ద్యావ మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కొత్తగట్టు ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

శంకరపట్నం, మార్చి 7: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ పాలకవర్గంతో గురువారం దేవాదాయ-ధర్మాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సమక్షంలో ఆలయ ఈవో సుధాకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా ఉప్పుగల్ల మల్లారెడ్డి, డైరెక్టర్లుగా గరిగె ప్రభాకర్, మొకిరాల కలింగరావు, తీగల కుమారస్వామి, కేశవేణి ఐలయ్య, ఎడ్ల తిరుపతి, కొయ్యడ నీలమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు శేషం మురళీధరాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఇఫ్‌కో సభ్యులకు అభినందన

చొప్పదండి, మార్చి 7: కరీంనగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన ఇఫ్కో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇఫ్‌కో ఆర్‌జీబీ సభ్యులుగా చొప్పదండి, పొరండ్ల, గట్టుదుద్దెనపల్లి సహకార సంఘాల అధ్యక్షులు వెల్మ మల్లారెడ్డి, స్వామి రెడ్డి, రాధాకిషన్ రావు ఎన్నికయ్యారు. సభ్యులను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ముల్కనూరు కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అభినందించారు.

శివరాత్రి వేడుకలకు ఆలయాల ముస్తాబు

కమాన్‌చౌరస్తా/ వీణవంక/ గంగాధర/ చిగురుమామిడి, మార్చి 7: మహాశివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలోని శైవక్షేత్రాలను ముస్తాబు చేశారు. నగరంతోపాటు వీణవంక, గంగాధర, చిగురుమామిడి తదితర మండలాల్లోని శివాలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కాగా, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రాంనగర్, మార్చి 7: కరీంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీకి పాల్పడిన నిందితుడిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గత డిసెంబర్ 24న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి కొన్ని విలువైన డాక్యుమెంట్లు అపహరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు సుభాష్‌నగర్‌కు చెందిన సుఖదేవి శేఖర్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి ఆ కోణంలో దర్యాప్తు జరిపారు. ఈ క్రమంలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. నగరానికి చెందిన అడ్వకేట్ మీర్జా అస్మత్ అలీ బేగ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీకి వ్యూహరచన చేసినట్లు గుర్తించారు. శేఖర్ తన స్నేహితులు మతీన్, ఒసామాను మీర్జా అజ్మత్ అలీ వద్దకు తీసుకెళ్లాడు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని గదిలో ఉన్న డాక్యుమెంట్లు చోరీ చేసి తీసుకు వస్తే రూ. 50,000 ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. గత డిసెంబర్ 24న మతీన్, ఒసామాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బయట వేచి ఉండగా, శేఖర్ లోపలికి వెళ్లి ఇనుపరాడుతో తాళాలు పగులగొట్టి బుక్ నెంబర్ 1లోని వాల్యూమ్ నెంబర్ 376 కలది అపహరించాడు. అనంతరం డాక్యుమెంట్లను అడ్వకేట్‌కు అప్పగించగా రూ. 50 వేల నగదు ఇచ్చాడు. ఈ కేసులో నిందితుడు శేఖర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అతని సెల్ ఫోన్‌ను సీజ్ చేశారు.

భూపాలపట్నంలో గ్రాడ్యుయేషన్ డే

చొప్పదండి, మార్చి 7: భూపాలపట్నంలోని సెయింట్ మదర్ థెరిసా పాఠశాలలో ఫాదర్, కరస్పాండెంట్ నాగోదు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ లచ్చయ్య, ఫాదర్లు డైజో, కిరణ్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.